క్లుప్తంగా

వెలగదుర్రులో విగ్రహాల పునఃప్రతిష్ఠ



భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలను పునః ప్రతిష్ఠిస్తున్న పండితులు

ఉండ్రాజవరం: వెలగదుర్రులోని భూదేవి, శ్రీదేవీ సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని నిర్మించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్వామి, అమ్మవార్ల విగ్రహాల పునఃప్రతిష్ఠ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పండితుల వేద మంత్రాలతో విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. బ్రహ్మశ్రీ వేదుల వెంకట రమణమూర్తి, శ్రీనివాసుల ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నిడదవోలు రూరల్: పట్టణంలోని చర్చిపేట యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు జువ్వల రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది నక్కా వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, ఉసురుమర్తి సూర్యచంద్రరావు, సూరిగోపు రవి, సూరిబాబు, ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు.

తపాలా శాఖలో బీమా పథకాలు

చాగల్లు: జీవిత బీమా కోసం తపాలా శాఖ ఏర్పాటు చేసిన పలు పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చాగల్లు పోస్టు మాస్టర్ డి.సురేష్ బాబు అన్నారు. చాగల్లులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ 399కే రూ.10 లక్షల జీవిత బీమా వర్తిస్తుందని, 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయసు వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈనెల 20 నుంచి 27 వరకూ తపాల శాఖ ఆధ్వర్యంలో మహా మేళా నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారుడు చెంతకే తపాలా సేవలు అందించడం ఈ మహామేళా లక్ష్యమన్నారు. ప్రజల వినియోగార్థం పొదుపు పథకాలపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు పెంచిందన్నారు.

ఇఫ్టూ రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరణ

నిడదవోలు రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా కమిటీ సభ్యుడు పామర్తి సత్యనారాయణ కోరారు. నిడదవోలు బస్టాండ్ కూడలిలో ఇఫ్టూ స్తూపం వద్ద గౌతమి ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. యూనియన్ కార్యదర్శి మల్లిడి రామిరెడ్డి, కమిటీ సభ్యులు ఆనంద్, షేక్ అహ్మద్ ఆలీ, వెంకటేశ్వరరావు, బాషా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తాళ్లపూడి: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని పెద్దేవం గ్రామంలో శుక్రవారం అధికారులు సీజ్ చేశారు. 20 మూటలు ఉన్న సుమారు టన్ను బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని సివిల్ సప్లై డీటీ సునీత తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు ఆటో నడుపుతున్న వ్యక్తిని, బియ్యం అమ్మిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు తాళ్లపూడి ఎస్సై వెంకటరమణ తెలిపారు.

రక్తహీనత నిర్ధారణ పరీక్షల పర్యవేక్షణ

నల్లజర్ల: రక్తహీనత నిర్ధారణ పరీక్షలు జరుగుతున్న తీరును రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక బృందంలోని ప్రోగ్రామింగ్ ఆఫీసర్ జి.రవీంద్రకుమార్ శుక్రవారం నల్లజర్ల పీహెచ్‌సీలో పరిశీలించారు. మండలంలో ఎంపిక చేసిన కొన్ని గ్రామాల్లో గర్భిణులను పిలిపించి వారికి ఏఎస్ఎంలతో హెచ్‌బీ పరీక్షలు చేయించారు. ఈసందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ రక్తహీనతతో ఏ ఒక్కరూ బాధ పడకూడదని, బలి కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రక్త పరీక్షల తీరు సక్రమంగానే ఉందన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్, సీహెచ్‌ఓ చంద్రశేఖరరాజు, ఎంపీహెచ్‌ఓ పలివెల సత్యం, పీహెచ్ఎన్ రాధాకుమారి, ఇందిర, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'గ్రీన్ ఫీల్డ్' పనులపై నిరసన

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం, సంజీవపురం గ్రామాల గిరిజన, గిరిజనేతరులు శుక్రవారం ఆ రెండు గ్రామాల మధ్య నిరసన వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల నిమిత్తం నిర్వహిస్తున్న క్వారీ కార్యకలాపాలతో తమ రెండు గ్రామాల మధ్య రోడ్డు దెబ్బతింటుందని, భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందంటూ వారు ఆరోపించారు. సుమారు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా రోడ్డు ధ్వంసం అవుతోందని నిరసనకారులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన గ్రీన్ ఫీల్డ్ హైవే పనులతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపడతామని, పనులు ముగిశాక శాశ్వత రోడ్డు నిర్మిస్తామన్న కాంట్రాక్టర్ హామీతో ఆందోళన విరమించారు.

రేటున్నా.. లాభం లేదన్నా..

- గడ్డు పరిస్థితుల్లో ఇటుక తయారీదారులు
- పెరిగిన ముడి సరకుల ధరలు
- కొనుగోలుకు వెనుకంజ వేస్తున్న నిర్మాణదారులు
- ఒడిదొడుకుల్లో బట్టీదారులు

పెరవలి: చిన్నదైనా.. పెద్దదైనా ఇల్లు కట్టాలంటే ఇటుక ఉండాల్సిందే. అలాంటి ఇటుకల ధరలు చుక్కల నంటాయి. దాంతో గృహ నిర్మాణదారుల బడ్జెట్ తడిసి మోపెడవుతోంది. అలాగని ఇటుక తయారీదారులు కూడా ఏమాత్రం సంతోషంగా లేరు. ముడి సరుకుల ధరలు పెరగడంతో గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 1000 ఇటుక సైజును బట్టి రూ.6 వేల నుంచి రూ. 6500 ధర పలుకుతోంది. ఆ రేటుకు ఇటుక కొనుగోలుకు నిర్మాణదారులు ఆసక్తి చూపకపోవడంత నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. సిమెంటు, ఐరన్ ధరలు పెరిగిపోవడంతో ఇప్పటికే ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న గృహ నిర్మాణదారులు ఇపుడు ఇటుక ధరలు కూడా బాగా పెరగడంతో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయలేక, అలాగని మధ్యలో నిలిపివేయలేక సతమతం అవుతున్నారు. సాదారణ ఇంటి నిర్మాణానికి 10 వేల నుంచి 12 వేల ఇటుక అవసరం. ఈ లెక్కన కేవలం ఇటుకకే రూ.లక్ష ఖర్చవుతోంది.

జిల్లాలో ఇటుక పరిశ్రమలు

తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 4 వేల ఇటుక బట్టీలు ఉన్నాయి. వాటిపై 4500 కుటుంబాలు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుండగా 40 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పరిశ్రమపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. పెరవలి మండలంలో 110, ఉండ్రాజవరం మండలంలో 80, నిడదవోలు మండలంలో 120 ఇటుక బట్టీలు ఉన్నాయి. గతేడాది 1000 ఇటుక ధర రూ.5,500 నుంచి రూ.7,500 పలికింది. ప్రస్తుతం బట్టీ వద్ద రేటు రూ.6000 ఉంది. ప్రభుత్వం తమ పెట్టుబడికి బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, వడ్డీ వ్యాపారులపై ఆధారపడి వ్యాపారాలు సాగిస్తున్నామని ఇటుక తయారీదారులు చెబుతున్నారు. అయితే విక్రయాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు.

పెరిగిన ముడి సరకులు ధరలు

ఇటుక తయారీలో వాడే ముడి సరకుల ధరలు పెరగడంతో, మరోమార్గం లేక ఇటుక రేటు పెంచాల్సి వచ్చిందని తయారీదారులు చెబుతున్నారు. గతేడాది రూ.4వేలు ఉన్న టన్ను బొగ్గు రేటు ఇపుడు రూ.8వేలకు పెరిగిందంటున్నారు. రూ. రూ.1800 ఉండే టన్ను కలప నేడు రూ.5000 పెరిగిందని చెబుతున్నారు. అలాగే **టొండు 5 టన్నులు రూ.5 వేల రూ.8,500కు, ఊక రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెరిగిందంటున్నారు. ఉచితంగా లభించే ఊక బూడిదకు ఇప్పుడు రూ.4000 చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం వెయ్యి ఇటుక రేటు** రూ.6000 నిలకడగా ఉన్నప్పటికీ తమకు నష్టాలు తప్పవని బట్టీ యజమానులు చెపుతున్నారు. కూలీల అడ్వాన్సులు ఒక్కో కుటుంబానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు ఇవ్వాల్సి వస్తోందంటున్నారు.



అన్నవరప్పాడులో పచ్చి ఇటుకను ఒబ్బిడి చేస్తున్న కూలీలు

నిర్మాణ వ్యయం పెరిగింది



ఇంటి నిర్మాణానికి ముహూర్తం చేశాం. తీరా చూస్తే సిమెంటు, ఐరన్ ధరలు పెరిగిపోయాయి. అంతేకాదు. నిర్మాణం మొదలెట్టేటపుడు వెయ్యి ఇటుక ధర రూ.5,500 ఉంటే ఇప్పుడది రూ.6500 కి పెరిగింది. నిర్మాణ ఖర్చులు అంచనాలను మించిపోతున్నాయి.

– యాతం మల్లికార్జునరావు, గృహ నిర్మాణదారుడు, అన్నవరప్పాడు

పాలుపోవడం లేదు



ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సిమెంటు, ఐరన్ ఇస్తోందని నిర్మాణంలోకి దిగాను. తీరా ఇపుడు ఇటుక రేటు చూస్తే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయగలనా? అనే సందేహం కలుగుతోంది. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– దేగల కోటేశ్వరరావు, గృహ నిర్మాణదారుడు, అన్నవరప్పాడు

ఒక్కో ఇటుక తయారీకి రూ.5.75



ఒక్క ఇటుక తయారీకి రూ.5.75 ఖర్చవుతోంది. మార్కెట్‌లో వెయ్యి ఇటుక ధర రూ.6 వేలు ఉంది. ఇలా అయితే కష్టనష్టాలకు ఓర్చుతున్న మాకేం మిగులుతుంది?. అకాల వర్షాలు వస్తే పచ్చి ఇటుక తడిస్తే రూ.లక్షల్లో నష్టం వస్తోంది. ఉచితంగా దొరికే ఊక బూడిదకు కూడా రూ.వేలు చెల్లించాల్సిన దుస్థితి.

– మోపిదేవి సోమేశ్వరరావు, ఇటుక బట్టీ నిర్వాహకుడు, మల్లేశ్వరం

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు



నిడదవోలు బస్టాండ్‌లో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

నిడదవోలు రూరల్: ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అన్నారు. నిడదవోలులోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి శుక్రవారం విచ్చేసిన ఆయన స్థానిక ఆర్టీసీ డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమలరావు మాట్లాడుతూ నవీకరణలో భాగంగా మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో అత్యధిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ అమలు విషయంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పండగలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులపై భారం పడకుండా అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి ఆక్యుపెన్సీ పెంచామన్నారు. గతేడాది దసరా పండగ, ఈ ఏడాది సంక్రాంతి, శివరాత్రులలో ఆర్టీసీకి ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. నిడదవోలు డిపోలో అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, నాయకులు పోలిరెడ్డి శివరామకృష్ణ తదితరులు కోరారు.

'డయల్ యువర్ డీఎం'కు నాలుగు ఫిర్యాదులు

కొవ్వూరు: డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంకు నాలుగు ఫిర్యాదులు అందాయని ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ఎన్ కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు నుంచి 4.30 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉదయం పది గంటలకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య నల్లజర్ల బస్ స్టేషన్ రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కొవులూరు గ్రామానికి చెందిన కేసీహెచ్ పుల్లయ్య ఫిర్యాదు చేశారు. ఆ సమయాల్లో ఆర్టీసీ సూపర్‌వైజర్‌ను నియమించాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం కుమార్ హామీ ఇచ్చారు. కొవ్వూరు నుంచి నల్లజర్ల, భీమడోలు మీదుగా ద్వారకాతిరుమలకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని మరొకరు కోరారు. గతంలో ఈ రూటులో బస్సు సర్వీసు ఉండేదని, అంతగా లాభదాయకంగా లేకపోవడంతో తొలగించామని డీఎం వివరించారు. ప్రస్తుతం ప్రతి శనివారం ఒక బస్సు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నల్లజర్ల బస్సు స్టేషన్‌లో రెలింగ్ రాడ్స్, టాయిలెట్స్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ పనులు వారం క్రితమే పూర్తి చేసినట్లు డీఎం వివరణ ఇచ్చారు. కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్‌కు గతంలో నడిపిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కట్టా బాలాజీ అనే వ్యక్తి ఫోన్‌లో అడిగారు. ఈ సర్వీసు అంతగా లాభదాయకంగా లేకపోవడంతో నిలిపివేశామని డీఎం బదులిచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని డీఎం కుమార్ వివరణ ఇచ్చారు.

డ్రాగన్ ఫ్రూట్స్ తోట ధ్వంసం

- రూ.25 లక్షల విలువైన పంట నష్టం
- పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు



ధ్వంసం చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోట

దేవరపల్లి: మండలంలోని యాదవోలులో ఓ రైతుకు చెందిన డ్రాగన్ ఫ్రూట్స్ తోటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై బాధిత రైతు కోలా రవికిరణ్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం.. సర్వే నంబరు 484/2లో రెండెకరాల భూమి 1966 నుంచి రవికిరణ్ కుటుంబ సభ్యుల స్వాధీనంలో ఉంది. అప్పటి నుంచీ అక్కడ పలు రకాల పంటలు పండిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆ భూమిలో సుమారు రూ.25 లక్షల పెట్టుబడితో డ్రాగన్ ఫ్రూట్స్ పంట వేశారు. జూన్ నుంచి పంట దిగుబడి రానుంది. ఇదిలా ఉండగా ఆ భూమికి సంబంధించి రవికిరణ్‌కు, అదే గ్రామానికి చెందిన బందపురం వీఆర్‌ఓ కె.వెంకటేశ్వరరావు, వీఆర్‌ఏ కరుటూరి కాంతారావు, రాజాకు మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఆ భూమి తమదని, తమకు అప్పగించాలన్నది వారి వాదనగా ఉంది. లేకుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామంటున్నారని రవికిరణ్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కలెక్టర్‌కు, కొవ్వూరు ఆర్‌డీఓకు ఫిర్యాదు చేశారు. రికార్డులు పరిశీలించి, విచారణ చేస్తామని ఆర్‌డీఓ చెప్పారని రవికిరణ్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న వ్యక్తులు గురువారం రాత్రి తన డ్రాగన్ ఫ్రూట్స్ తోటను పూర్తిగా ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. అయితే, డ్రాగన్ ఫ్రూట్స్ పంట వేసిన భూమికి, తనకు ఎటువంటి సంబంధమూ లేదని వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు ‘సాక్షి’కి చెప్పారు. దానికి దిగువనున్న భూమి తనదని, డ్రాగన్ ఫ్రూట్స్ తోట ధ్వంసంతో తనకు ఎటువంటి సంబంధమూ లేదని తెలిపారు. ఈ భూమి విషయంలో వీఆర్‌ఏ కాంతారావుకు రవికిరణ్‌కు మధ్య వివాదం జరుగుతుందని ఆయన తెలిపారు. రవికిరణ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్సై కె. శ్రీహరిరావు చెప్పారు.

పార్టీ అనుబంధ విభాగాల్లో ముగ్గురికి స్థానం



చౌటుపల్లి వీరన్న



సలాది సందీప్‌కుమార్



గుడా విజయరాజు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో కొవ్వూరు నియోజకవర్గానికి మూడు కీలక పదవులు దక్కాయి. ఐ.పంగిడికి చెందిన చౌటుపల్లి వీరన్న జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితుడయ్యాడు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వీరన్న గతంలో మండల యువజన విభాగం అధ్యక్షుడిగాను, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడిగాను పనిచేశారు. అలాగే పట్టణానికి చెందిన సలాది సందీప్‌కుమార్ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గతంలో ఈయన పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగాను, పట్టణ బూత్ కమిటీ కన్వీనర్‌గాను పనిచేశారు. ఇక తాళ్లపూడికి చెందిన గుడా విజయరాజు గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గతంలో ఈయన జిల్లా కమిటీ సభ్యుడి గాను, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగాను పనిచేశారు. కాగా పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన చౌటుపల్లి వీరన్నకు ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, కాపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు కామన రత్నాజీ, మాజీ ఉప సర్పంచ్ తోట దుర్గారావు తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

'గోరుముద్ద'పై శ్రద్ధ పెట్టండి

గోపాలపురం: పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలుపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వయోజన విద్య జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి కేవీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని వెంకటాయపాలెం, చిట్యాల, చెరుకుమల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. మూడు పాఠశాలల్లోను రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. నూరు శాతం విద్యార్థులు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన పౌష్టికాహారం, పారిశుద్ధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం కూరం నారాయణరావు, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షులు



ఎమ్మెల్యే తలారికి కృతజ్ఞతలు చెబుతున్న వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల అధ్యక్షులు

దేవరపల్లి: ఇటీవల నియమితులైన వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల అధ్యక్షులు శుక్రవారం దేవరపల్లిలోఎమ్మెల్యే తలారి వెంకట్రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కమి టీల అధ్యక్షులు ఎమ్మెల్యే తలారిని సన్మానించారు. సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో పదవులు పొందిన నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యే వరకు నాయకులు, కార్యకర్తలు అవిశ్రాంతంగా పనిచేయాలన్నారు. పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, మండల మహిళా కన్వీనర్ కడలి హైమావతి, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కుసులూరి వెంకట సతీష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు అనిశెట్టి సూర్యచంద్రరావు, ఎమ్మెల్యే తలారిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.